సాక్షి
కాకినాడ

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



పొగాకు నాట్లు ప్రారంభం

తూర్పు గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా పండిస్తున్న వర్జీనియా పొగాకు సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు.

II లో



పరిహారం.. పరిహాసం

కొమరిపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పెను విస్ఫోటంలో మృత్యువాత పడిన కూలీల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటి వరకూ పరిహారం ప్రకటించలేదు.

4.68 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 4,68,466 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

రాజమహేంద్రవరం కమిషనర్‌గా జేసీ రాహుల్ మీనా



నూతన జేసీ అపూర్వ భరత్



జేసీ రాహుల్ మీనా



కమిషనర్ భావన

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జేసీగా మీనా సుమారు ఏడాది కాలం పాటు జిల్లాలో పని చేశారు. ఆయన స్థానంలో జాయింట్ కలెక్టర్‌గా ఎటపాక సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌ను నియమించారు. ఇదిలా ఉండగా కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన కూడా బదిలీ అయ్యారు. ఆమెను బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. భావన ఇక్కడ సుమారు 15 నెలల పాటు కమిషనర్‌గా పని చేశారు.

నేడు దిశ సమావేశం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుంది. కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న వివిధ పథకాలు, అభివృద్ధిపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

జక్కంపూడి రామ్మోహనరావుకు ఘన నివాళి



జక్కంపూడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా పోరాట యోధుడు, మాజీ మంత్రి, తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు ఆశయ సాధనకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. జక్కంపూడి రామ్మోహనరావు 14వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కంబాల చెరువు సెంటర్‌లో ఆయన విగ్రహానికి గురువారం ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలు, కార్మిక లోకం అభ్యున్నతి కోసం తన తండ్రి నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. ఆయన పోరాట స్ఫూర్తిని ఆయుధంగా తీసుకుని ముందుకు వెళ్తున్నానని చెప్పారు. ఆయన ఆశయ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేసిన జక్కంపూడి రామ్మోహనరావు.. వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి, నాయకులు నీలి ఆనంద్, మహ్మద్ ఆరిఫ్, నరవ గోపాలకృష్ణ, మానే దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ.. తీస్తున్నారా ఊపిరి!

- నేటి నుంచి నిలిచిపోనున్న ఎన్టీఆర్ వైద్య సేవలు
- జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులు 32
- ఏడాది కాలంగా రూ.110 కోట్లు పైనే బకాయిలు
- సేవల బంద్‌కు ఆషా పిలుపు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎంతో మంది ప్రాణాలు నిలిపి.. ఎన్నో కుటుంబాల్లో కొత్త వెలుగులను ప్రసరింపజేసి.. ఆపన్నులకు అపర సంజీవనిగా నిలిచిన ఆరోగ్యశ్రీ (కూటమి సర్కారు 'ఎన్టీఆర్ వైద్య సేవ'గా పేరు మార్చింది) ఊపిరిని ఆపివేసేందుకు కూటమి సర్కారు శతవిధాల ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ పథకం కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఏడాదికి పైబడి కోట్లాది రూపాయల మేర బకాయిలు పెట్టింది. ఈ బకాయిల గుదిబండను ఇక మోయలేమంటూ నెట్‌వర్క్ ఆస్పత్రులు శుక్రవారం నుంచి సేవలు నిలిపివేయనున్నాయి. ఈ పథకం కింద కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందుకుంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ వార్త అశనిపాతమే అవుతోంది.

పైసా ఖర్చు లేకుండా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పేద, మధ్య తరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించింది. క్యాన్సర్ వంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా సాయం అందించింది. ఈ పథకం కింద 1,059 ప్రొసీజర్లు (చికిత్సలు) అందిస్తుండగా.. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ సంఖ్యను ఏకంగా 3,257కి పెంచారు. అంతే కాకుండా, కుటుంబానికి రూ.5 లక్షల వరకూ ఉన్న చికిత్స పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచారు. తద్వారా పేదల ఆరోగ్యానికి ఎంతో భరోసా కల్పించారు. జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆస్పత్రులు 32 ఉన్నాయి. వీటిల్లో ప్రతి రోజూ 2,500 వరకూ ఓపీ నమోదవుతుండగా ఇన్ పేషెంట్లుగా ఐదారు వందల మంది వరకూ ఈ పథకం కింద చేరుతున్నారు. **పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని రోగులకు ప్రతి నెలా రూ.25 కోట్ల** విలువైన శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని అంచనా. ఈవిధంగా పేదల పాలిట కల్పతరువుగా నిలిచిన ఈ మహత్తర పథకానికి మంగళం పాడేందుకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి సర్కారు ఎత్తులు వేస్తోంది. ఈ పథకం స్థానంలో ఆరోగ్య బీమా ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే నెట్‌వర్క్ ఆస్పత్రులకు కోట్లాది రూపాయల మేర బకాయిలు చెల్లించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బకాయిల గుదిబండ

జిల్లాలోని ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.110 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో ఆస్పత్రికి రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ బకాయిలున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అప్పుడే ఏడాదిన్నర అవుతోంది. ఈ బకాయిలు కూడా ఏడాది నుంచి తొమ్మిది నెలల కాలంలో ఉన్నవే. వీటిని వెంటనే విడుదల చేయాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) నెల రోజుల క్రితం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కానీ, ప్రభుత్వం స్పందించలేదు. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రుల సేవల నిలిపివేత అనివార్యమైంది. ఇంత కాలం పంటి బిగువన సమస్యలు భరించామని, ఇక తమ వల్ల కాదని నెట్‌వర్క్ ఆస్పత్రులు స్పష్టం చేస్తున్నాయి. కోట్లాది రూపాయల మేర బకాయిలు చెల్లించకపోతే తాము ఎంత కాలం వైద్య సేవలు అందించగలుగుతామని ప్రశ్నిస్తున్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిల విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి స్పష్టంగా వివరించినా ఫలితం లేదని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 25న సమావేశమైన ఆషా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నామని నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు చెబుతున్నారు. ఈ మేరకు కాకినాడ సహా జిల్లాలోని 32 ప్రైవేటు, కార్పొరేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు సహకారం అందించే ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్‌లలో ఆరోగ్య మిత్రలు లేకుండా చేస్తున్నారు.



ప్రజల ఆందోళన

నెట్‌వర్క్ ఆస్పత్రులు సేవలు నిలిపివేస్తూండటంతో ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత చికిత్సలు అందక తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్యశ్రీపై ఉచిత వైద్య సేవలు పొందేందుకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు వచ్చే రోగులు సొమ్ము చెల్లిస్తేనే వైద్యం అందే పరిస్థితి కనిపిస్తోంది. సొమ్ము చెల్లించే స్తోమత లేని వారు ప్రాణాలు అరచేత పట్టుకుని వెను తిరగాల్సిన దుస్థితి ఏర్పడనుంది.

బకాయిలు విడుదల చేయకపోవడం అన్యాయం



ఆరోగ్యశ్రీకి జవసత్వాలు లేకుండా చేయాలనుకోవడం అన్యాయం. నెట్‌వర్క్ ఆస్పత్రులకు కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయినా కూటమి సర్కారు స్పందించకపోతే ఇక పేదలకు వైద్యం ఎలా అందుతుంది? జిల్లాలోని దాదాపు అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులకూ రూ.100 కోట్ల బకాయిలు పేరుకుపోయినట్టు వైద్యులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాదిన్నర అవుతోంది. ఇంతవరకూ బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చూస్తూంటే పేదల ఆరోగ్యంపై ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది.

– గుబ్బల తులసీకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు, యు.కొత్తపల్లి

పేదల ఆరోగ్యానికి తూట్లు పొడవకండి



పేదల ఆరోగ్యానికి తూట్లు పొడవకండి. నిరుపేదలు, మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం ఒక వరం లాంటిది. ఆ పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చేసినంత మాత్రాన ఆ వర్గాలకు ఒరిగిందేమీ లేదు. ఆరోగ్యశ్రీ రూపురేఖలనే మార్చేస్తున్నారు. సేవలను కుదించేసి ఆ పథకాన్నే నీరుగార్చేసేందుకు పాలకులు కుట్రలు పన్నుతున్నారు. బకాయిలు విడుదల చేయకుండా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పేదలకు వైద్యం ఉచితంగా చేయమంటే ఎలా చేస్తారు? అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయిపోయినా ఇంతవరకూ బకాయిలు విడుదల చేయకపోడం అన్యాయం.

– జమ్మలమడక నాగమణి, పౌర సరఫరాల సంస్థ మాజీ డైరెక్టర్

ప్రమాద రహితంగా బాణసంచా తయారీ




కొత్తపేటలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

కొత్తపేట: ప్రమాద రహితంగా బాణాసంచా తయారీకి యజమానులు, సిబ్బంది ఫైర్ నిబంధనలు పాటిస్తూ , జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్ మీనా సూచించారు. జిల్లాలోని రాయవరం బాణసంచా తయారీ కేంద్రంలో బుధవారం భారీ విస్ఫోటం సంభవించి 8 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్పీ రాహుల్ మీనా జిల్లాలోని కొత్తపేట మండల పరిధిలోని బాణసంచా తయారీ కేంద్రాలు, దీపావళి బాణసంచా హోల్‌సేల్ దుకాణాల్లో గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల లైసెన్స్‌లు, వాటిని రెన్యువల్ చేశారా? ఆయా కేంద్రాల వద్ద, పరిసరాల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నారా? నిర్లక్ష్యంగా ఉన్నారా? తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. ఆయా కేంద్రాల యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బాణసంచా కేంద్రాల వద్ద అగ్నిమాపక రక్షణ పరికరాలు ఉంచుకోవాలని, ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రమాదం సంభవిస్తే ప్రాణనష్టం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా బాణసంచా కేంద్రాల వద్ద ధూమపానం చేయకుండా చూడాలని, మండే గుణం కలిగిన వస్తువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, మైనర్‌లను పనిలో చేర్చుకోరాదని ఎస్పీ రాహుల్ మీనా సూచించారు. ఎస్పీ వెంట రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, స్పెషల్ బ్రాంచి సీఐ పుల్లారావు, కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేడు పరావాసుదేవి అలంకరణలో శేష వాహనంపై ఊరేగింపు
- ముస్తాబైన కోనసీమ తిరుమల క్షేత్రం



విద్యుద్దీప కాంతుల్లో శోభాయమానంగా వాడపల్లి వెంకన్న ఆలయ ప్రాంగణం

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు ఈ నెల 18 వరకూ వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని, రాజగోపురంతో సహా ఉపాలయాలను, పరిసరాలను ఆ ప్రాంగణాన్ని, రంగురంగుల పూలమాలలు, విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామివారు వివిధ అలంకరణలతో విహరించే వాహనాలను ముస్తాబు చేశారు. వాహన సేవలు, నిరంతరాయంగా సాగే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. తొలి రోజు ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, విశేషార్చన, నీరాజనం, సాయంత్రం వాస్తు హోమం, ధ్వజ పతాక హోమాలు నిర్వహించనున్నారు. రాత్రి స్వామి వారిని పరావాసుదేవ అలంకరణలో శేషవాహనంపై ఊరేగించనున్నారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు.

కొబ్బరిలో అంతర పంటలకు సాయం

రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి

అమలాపురం రూరల్: కోనసీమలో కొబ్బరి తోటల్లో అంతర పంటలుగా కోకో, అరటి, మిరియం వంటి వాటి సాగు ద్వారా అదనపు ఆదాయాన్ని ఆర్జించేలా ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం రైతులకు సహకారం అందిస్తుందని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కోకో సాగులో మోడ్రన్ ప్రాక్టీస్ ఇన్ పోస్ట్ హార్వెస్టింగ్ మేనేజ్‌మెంట్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను రైతులతో నిర్వహించారు. కోకో సాగు ద్వారా ఎకరాకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆర్జించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 2,500 ఎకరాల్లో కోకో సాగవుతోందని, ఈ అంతర పంట సాగును ఏడాదికి వెయ్యి ఎకరాల చొప్పున విస్తరించేందుకు కలెక్టర్ చొరవ చూపడం అభినందనీయమని అన్నారు. నాణ్యమైన గింజల ఉత్పత్తి ద్వారా కిలోకు అదనంగా రూ.150 వరకూ పొందవచ్చునన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ, 50 శాతం పాక్షిక నీడలో కొబ్బరి తోటలలో అంతర పంటగా కోకోకు మంచి అవకాశం ఉందని గుర్తించామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం సీఈవో శేఖర్ బాబు, కృషివల ఎఫ్‌పీఓ సభ్యుడు ఉప్పుగంటి భాస్కరరావు మాట్లాడారు. చెన్నైకి చెందిన శాస్త్రవేత్త నితిన్ సిసోడియా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాగు విలువ ఆధారిత యూనిట్ల స్థాపన విధి విధానాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, శాస్త్రవేత్త మాధవీలత, ఉద్యాన అధికారి దిలీప్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధి అడ్డాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఉద్యానశాఖ ప్రదర్శనను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి, కలెక్టర్ మహేష్‌కుమార్

పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలి

- వేతన సవరణ కమిటీని నియమించాలి
- ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ డిమాండ్

అమలాపురం టౌన్: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ఈ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులకు చెల్లించాలని, వేతన సవరణ కమిటీని నియమించాలని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ ఆలపాటి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో జిల్లా ఎన్‌జీవో సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, కూటమి ప్రభుత్వం తమ పట్ల వహిస్తున్న నిర్లక్ష్యంపై చర్చించింది. వేతన సవరణ కమిటీని వేస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదని విద్యాసాగర్ అసహనం వ్యక్తం చేశారు. అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. హెల్త్ కార్డు సిస్టంను క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగులకు వైద్యం అందించేలా సహకరించాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.వెంకట రమణ, ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ, పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా నూతన అడ్‌హాక్ కమిటీని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా అధ్యక్షుడిగా మాధవరపు వెంకటేశ్వర్లు, కన్వీనర్‌గా గుత్తుల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా గుర్రాల సురేష్ సింగ్, సభ్యులుగా తాడి ఏసుబాబు, రూతమ్మ, సీహెచ్ చిట్టిబాబు, పి.రవి ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయి ప్రసాదరావుతో పాటు జిల్లాలోని తాలూకా యూనిట్ల కార్యవర్గ ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

మందుపాతరలతో సహజీవనం

- బాణసంచా కేంద్రాల్లో భద్రత లేని కూలీలు
- కనీస రక్షణ కరవు
- చుట్టూ పేలుడు పదార్థాలు
- శరీరంపై కూడా రసాయనాలే
- అందుకే ప్రమాదం నుంచి తప్పించుకోలేకపోతున్న కార్మికులు
- ఘటనా స్థలంలోనే మృత్యువాత
- నిపుణులు కూడా కొరత
- దీపావళి సమయంలో తాత్కాలికంగా కూలీల నియామకం
- ఆర్డర్ల పేరుతో అవిశ్రాంతంగా పనులు

సాక్షి, అమలాపురం: బాణసంచా తయారీ కేంద్రాలలో పని చేయడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే. మిగిలిన చోట్ల ఏమో కానీ.. బాణసంచా తయారీ కేంద్రంలో పని చేయడం అంటే మృత్యువుతో నిత్యం చెలగాటం ఆడడమే. అది తెలిసి కూడా కార్మికులు, కూలీలు పొట్టకూటి కోసం వీటిలో పని చేసేందుకు వెళుతున్నారు. మందుపాతర మీద కూర్చుని జీవన పోరాటం సాగిస్తున్నారు. దురదృష్టవశాత్తూ ప్రమాదాలు జరిగితే మృత్యువు బారిన పడుతున్నారు. గాయాలతో బయటపడినా జీవచ్ఛవాలుగా మారుతున్నారు.



బాణసంచా కేంద్రాల్లో పని చేస్తున్న కార్మికుల శరీరానికి పట్టిన రసాయనాలు (ఫైల్)

అనుమతి లేని కేంద్రాలే అధికం

రాయవరంలోని శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో బుధవారం పెను విస్ఫోటం జరిగి ఎనిమిది మంది మృత్యువాత పడగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి, మృత్యువుతో పోరాడు తున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో బాధి తులందరూ అతి పేద కుటుంబాలకు చెందినవారే కావడం గమనార్హం. జీవనోపాధి కోసం ప్రాణాలు పణంగా పెట్టి మరీ వీరు ఇక్కడ పని చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు అధికారికంగా 18 వరకూ ఉండగా, ఒక స్టోరేజ్ కేంద్రం ఉంది. కానీ, వాస్తవంగా అనుమతి లేని కేంద్రాలు చాలా ఉన్నాయి. అనుమతి ఉన్న కేంద్రాలలో మాత్రమే అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమతి లేని తయారీ కేంద్రాలు, అమ్మకం దుకాణాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇటీవల అయినవిల్లి మండలం విలసలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన బాణసంచా పేలడం వల్ల ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే.

కార్మికుల రక్షణ పట్టని అధికారులు

- నిబంధనల ప్రకారం అన్ని రక్షణ చర్యలూ తీసుకుంటేనే అనుమతులు ఇస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ, కార్మికుల రక్షణ విషయాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు.
- బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరిగితే తొలుత బలైపోతున్నది కార్మికులు. ఇక్కడ పని చేసే వారిలో 90 శాతం మంది రోజువారీ కూలీలే. వీరెవ్వరూ వృత్తి నైపుణ్యం ఉన్నవారు కాదు. అనుభవం ఉన్న కార్మికులకు సైతం బాణసంచాకు ఉపయోగించే ముడిసరకుపై అవగాహన ఉండదు. ఎటువంటి రసాయనాల సమ్మేళనం వల్ల పేలుడు సంభవిస్తుందనే అవగాహన సైతం వారికి ఉండటంలేదు.
- బాణసంచాలో పెద్ద శబ్దాలు వచ్చేందుకు అమోనియం నైట్రేట్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. దీనికి కొద్దిపాటి ఒత్తిడి పెరిగితే పేలిపోయే స్వభావం ఉంటుంది. అయితే పని చేసే వారికి ఈ అవగాహన లేకుండా పోతోంది.
- పొటాషియం నైట్రేట్, మెగ్నీషియం పౌడర్, సల్ఫర్ రసాయనాలు అధికంగా వాడతారు. ఇవి వాడేటప్పుడు కనీస రక్షణ చర్యలు తీసుకోవాలి. పౌడర్‌గా తగు పాళ్లలో కలిపి క్రాకర్స్ తయారు చేయాల్సి ఉంది.
- బాణసంచా తయారీ కేంద్రాల్లో అన్ని రసాయనాలూ కలిపి నూరడం వల్ల పేలుడుకు దారి తీస్తాయి. విడివిడిగా ఫార్ములా తయారు చేయాలి. అన్ స్కిల్డ్ లేబర్‌తో నూరిస్తున్నారు. అదే పేలుళ్లకు దారి తీస్తోంది.
- బాణసంచా తయారు చేసే ప్రతి కార్మికునికి చేతులకు గ్లౌజ్‌లుండాలి. అగ్నిప్రమాదాల బారిన పడకుండా ప్రత్యేక వస్త్రాలు వేసుకోవడంతో పాటు తలకు హెల్మెట్ పెట్టుకోవాలి. ముఖానికి మాస్క్ తప్పనిసరి. తయారు చేస్తున్న బాణసంచా, దానికి వాడే రసాయనాలు, వాటిని ఎలా కలపాలనే దానిపై కార్మికుడికి అవగాహన కల్పించాలి. కానీ, ఎక్కడా ఇటువంటివి పాటించడం లేదు.
- బాణసంచా తయారు చేస్తున్నప్పుడు కార్మికులు, కూలీల ఒంటికి రసాయనాలు దట్టంగా పట్టేస్తున్నాయి. కాళ్లు, చేతులు, ముఖం, వేసుకున్న దుస్తులకు రసాయనాలు పట్టడం వల్ల పేలుడు సమయంలో వారు కూడా పూర్తిగా కాలిపోతున్నారు. ఒకవేళ తీవ్ర గాయాలై ప్రాణాలతో బయటపడినా రసాయనాల వల్ల మండిపోయిన శరీరంతో జీవచ్ఛవాలుగా మారుతున్నారు. కనీసం గుర్తు పట్టేందుకు కూడా వీలు లేకుండా వారి శరీరాలు మారిపోతున్నాయి. జిల్లాలో ఇంచుమించు ప్రతి బాణసంచా తయారీ కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.
- రసాయనాలతో బాణసంచా తయారు చేసేటప్పుడు ప్రతీ కార్మికుని ముఖానికి మాస్క్ తప్పనిసరి. ఒక్కచోట కూడా ఈ పద్ధతి అవలంబించట్లేదు. దీనివల్ల కార్మికులు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఊపిరితిత్తులు దెబ్బ తినడంతో పాటు చర్మవ్యాధులు ప్రబలుతున్నాయి. కొంతమంది చిన్న వయసులోనే క్యాన్సర్ల బారిన పడుతున్నారు.
- దీపావళి సమయంలో పెద్ద ఎత్తున వచ్చే ఆర్డర్ల కోసం తయారీదారులు అప్పటికప్పుడు సాధారణ కూలీలను కూడా పనిలో పెట్టుకుంటున్నారు. వారికి అనుభవం లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.
- చిన్న పిల్లలను, మహిళలను మందుగుండు సామగ్రి తయారు చేసేందుకు అనుమతించకూడదు. కానీ, కొమరిపాలెం పేలుడులో మృతి చెందిన వారిలో ఐదుగురు మహిళలే.
- ఇంత జరుగుతున్నా వీటిపై నిఘా పెట్టాల్సిన రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మిక, వైద్య శాఖలు వీటి వైపు కన్నెత్తి చూడడం లేదు.

తనిఖీ చేసిన కేంద్రంలోనే భారీ ప్రమాదం

తయారీ కేంద్రాల వద్ద తీసుకుంటున్న రక్షణ చర్యలు, అధికారుల తనిఖీలు కూడా లోపభూయిష్టంగా ఉంటున్నాయి. ఉండాల్సిన స్థాయిలో వాటర్ ట్యాంకులు ఉన్నాయా? ఇసుక నిల్వలు ఉంచారా? తయారీ కేంద్రం ఊరికి దూరంగా ఏర్పాటు చేశారా లేదా? మంటలను ఆర్పే కార్బన్ డయాక్సైడ్ కిట్ ఉందా, లేదా చూసి లైసెన్సులు రెన్యువల్ చేయడం, కొత్తగా ఏర్పాటు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తున్నారు. రాయవరంలో ప్రమాదానికి గురైన బాణసంచా తయారీ కేంద్రాన్ని కూడా అధికారులు ఇటీవల తనిఖీ చేసి రెన్యువల్ చేశారు. అటువంటి చోటే భారీ ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం.

రసాయనాల పట్ల అవగాహన ఉండాలి



బాణసంచా తయారు చేసేందుకు వాడే రసాయనాలపై ప్రతి కార్మికునికి, కూలీలకు అవగాహన ఉండాలి. ఇందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సి ఉంది. రసాయనాలను కలిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఇవన్నీ మండే కారకాలే. కార్మికుల ఒంటి నిండా రసాయనాలు ఉంటున్నాయి. ఈ కారణంగానే చిన్న నిప్పురవ్వ రాజుకున్నా పేలుడు సంభవించడం, కార్మికులు చనిపోవడం పరిపాటిగా మారింది.

– పెచ్చెట్టి కృష్ణ కిషోర్, రసాయన శాస్త్ర అధ్యాపకుడు, అమలాపురం

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

నిడదవోలు : నర్సాపురం - నిడదవోలు కాలువలో కొట్టుకువచ్చిన గుర్తు తెలియని పురుషుని మృతదేహాన్ని పెరవలి ఇరిగేషన్ లాకుల వద్ద పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. సుమారు 45 ఏళ్లు ఉంటాయి. మృతుని శరీరంపై నీలం రంగు ట్రాక్ ఉంది. జుట్టు అంతా నీటిలో ఊడిపోయింది. చేతికి దేవుడు తాళ్లు ఉన్నాయి. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గొలుసు దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్

38 గ్రాముల బంగారం రికవరీ

యానాం: స్థానిక కనకాలపేటలో బుధవారం ఉదయం బంగారం దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి బంగారం రికవరీ చేశామని ఎస్పీ వరదరాజన్ విలేకర్లకు తెలిపారు. పాన్‌షాప్ నిర్వహిస్తున్న నల్లా శేషారత్నకుమారి మెడలో నుంచి రచ్చవారిపల్లి సుభాష్ అనే వ్యక్తి బంగారపు శతమానాలతో ఉన్న తాడు, నల్లపూసలు బలవంతంగా లాగి పట్టుకుని పారిపోయాడు. ఆమె గట్టిగా అరుస్తూ చుట్టుపక్కల వారిని పిలిచింది. ఈ లోపులోనే అతను పారిపోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్పీ వరదరాజన్ ఆదేశాల మేరకు ఎస్ఐ పునీత్ రాజ్, ఎస్ఐ-2 కట్టా సుబ్బరాజు క్రైమ్ టీం నిందితుణ్ణి గాలించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 38 గ్రాముల బంగారాన్ని స్వాధీన పరచుకున్నారు. దాని విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని ఎస్పీ మీడియా సమావేశంలో తెలిపారు. దొంగతనం కేసును గంటల్లోనే ఛేదించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడలరసన్, క్రైం టీంను ఎస్పీ అభినందించారు.

పరిహారం.. పరిహాసం

- బాణసంచా పేలుడు బాధితులకు సాయం ప్రకటించని కూటమి ప్రభుత్వం
- తీరిగ్గా ఇప్పుడు తనిఖీలు ప్రారంభించిన జిల్లా యంత్రాంగం



రాయవరంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదం

సాక్షి, అమలాపురం/ రాయవరం: రాయవరంలోని శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రంలో పెను విస్ఫోటం జరిగి నిరుపేద కూలీలు మృత్యువాత పడినా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు పరిహారం ప్రకటించలేదు. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా ప్రభుత్వం నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాకు చెందిన రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్, హోం శాఖమంత్రి వంగలపూడి అనితతోపాటు ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని చెప్పారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి పరిహారంపై స్పష్టత లేదు. ఇటువంటి చోట పనిచేసేవారికి అటు యాజమాన్యం, ఇటు కార్మిక శాఖలు కలిసి ఇన్సూరెన్స్ చేయించాల్సి ఉంది. కాని చనిపోయిన వారి వివరాలు కూడా కార్మిక శాఖకు వెంటనే తెలియని దుస్థితి. మృతులు కార్మికశాఖ రికార్డుల్లో నమోదు కానట్టు తెలిసింది. 'ఎంప్లాయిస్ కాంపన్సేషన్ యాక్టు' ప్రకారం యజమానుల వద్ద నుంచి పరిహారం కోరతామని కార్మిక శాఖ అధికారులు చెబుతున్నారు.

చేతులు కాలాక హడావుడి

బాణసంచా తయారీ కేంద్రంలో పెను విస్ఫోటంతో తీవ్ర విషాదం నెలకొనడంతో జిల్లా యంత్రాంగం ఇప్పుడు హడావుడి చేస్తోంది. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాలోని అన్ని శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఉన్న బాణసంచా తయారీ యూనిట్లు, హోల్‌సేల్ విక్రయ కేంద్రాల లైసెన్సులను, భద్రత, రక్షణ ప్రమాణాల అంశాలను మూడు రోజులపాటు పర్యవేక్షణ బృందాలు తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కేంద్రాలలో పనిచేసే కార్మికులకు నైపుణ్యం ఉన్నదీ లేనిదీ చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బాణసంచా తయారీ యూనిట్లు 18 వరకు ఉన్నాయని, హోల్‌సేల్ డీలర్లు 19 మంది వరకు ఉన్నారన్నారు. ప్రతి కార్మికునికి బీమా చేయిస్తున్నదీ లేనిదీ చూడాలన్నారు. కలెక్టర్ ఆదేశాలతో తయారీ, విక్రయ కేంద్రాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. బాణసంచా దుర్ఘటన జరిగిన ప్రాంతాన్ని ఆయన పార్టీ సభ్యులతో కలిసి గురువారం పరిశీలించారు.

విషమంగా ఆ ఇద్దరి ఆరోగ్యం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కొమరిపాలెం బాణసంచా బాధితుల ఆరోగ్యం ఆందోళనకరంగా ఉంది. 21 ఏళ్ల లింగం వెంకట కృష్ణ దేహం 80 శాతం మేర కాలిపోగా, 30 ఏళ్ల చిట్టూరి యామిని శరీరం 99 శాతం మేర కాలిపోయింది. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు వివరించారు. యామినికి శాచ్యురేషన్ కనిష్ట స్థాయిలో కూడా ఉండడం లేదన్నారు. మూత్రపిండాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, శ్వాసకోసలో చీము, నెత్తురు చేరాయని తెలిపారు. బాధితులు ఇద్దరికి మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కొనసాగుతోందని తెలిపారు. నిపుణులైన వైద్య బృందాలతో కాకినాడ జీజీహెచ్‌లోని ఎస్ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు.

మృతదేహాల అప్పగింత



వాసంశెట్టి విజయలక్ష్మి (ఫైల్)

రాయవరం: గ్రామ పరిధిలో బుధవారం జరిగిన బాణసంచా దుర్ఘటనలో మృతదేహాలను బాధిత కుటుంబాలకు గురువారం పోలీసులు అప్పగించారు. ఆరు మృతదేహాలకు రామచంద్రపురం, రెండు మృతదేహాలకు కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ దుర్ఘటనలో బాణసంచా యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి(సత్తిబాబు)తో సహా ఏడుగురు కూలీలు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నట్లు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు.

కుటుంబానికి ఆధారం కోల్పోయాం

కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వాసంశెట్టి విజయలక్ష్మి(51) మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన విజయలక్ష్మి పొట్టకూటి కోసం బాణసంచా తయారీకి కూలి పని నిమిత్తం వస్తోంది. ప్రతి రోజూ మాదిరిగానే బుధవారం కూలి పనికి వచ్చిన విజయలక్ష్మి దుర్ఘటనలో తీవ్రగాయాల పాలైంది. కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందింది. ఇదిలా ఉంటే కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న విజయలక్ష్మి మృతితో కుటుంబం ఆధారం కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పని చేసుకుని ఇంటికి వస్తుందని ఆశించామని, ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

అంత్యక్రియలు పూర్తి

అనపర్తి : శ్రీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో జరిగిన విస్ఫోటంలో మృతిచెందినవారి అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ ప్రమాదంలో అనపర్తి శివారు సావరానికి చెందిన కుడిపూడి జ్యోతి, పెంకే శేషారత్నం, చిట్టూరి శ్యామల ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వారి మృతదేహాలకు స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

కూలీలను కాపాడబోయి యజమాని ఆహుతి



వెలుగుబంట్ల సత్తిబాబు (ఫైల్)

రాయవరం: బాణసంచా ప్రమాదాల్లో సాధారణంగా కూలీలే సమిధలవుతారు. అయితే రాయవరంలో జరిగిన బాణసంచా ప్రమాదంలో కూలీలతో పాటుగా తయారీ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు) మృత్యువాత పడ్డారు. దీపావళి సమీపిస్తుండడం, వివాహ ముహూర్తాలకు ఆర్డర్లు వస్తుండడంతో కూలీలతో పనులు చేయిస్తున్నారు. అనుకోకుండా జరిగిన దుర్ఘటన యజమాని సత్తిబాబుతో సహా ఎనిమిది మంది ప్రాణాలను బలిగొంది. అప్పటి వరకు బయట కూర్చున్న సత్తిబాబు ప్రమాదంలో చిక్కుకున్న కూలీల ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో భాగంగానే మృత్యువాత పడినట్లుగా భావిస్తున్నారు. ప్రమాద జరిగిన వెంటనే ఇద్దరు కూలీలను బయటకు లాగినట్లుగా స్థానికులు ఇచ్చిన సమాచారం ప్రకారం తెలుస్తోంది. మరొకరిని బయటకు లాగే సమయంలో అప్పటికే అగ్నికీలలు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో మృత్యువుకు చేరువైనట్లుగా భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బయట కుర్చీలో కూర్చున్న ఆయన అక్కడి నుంచి పారిపోయి ఉంటే ప్రాణాలతో బతికే వారని, కాని కూలీలను రక్షించే క్రమంలోనే అసువులు బాసినట్లుగా సమీపంలోని బాణసంచా తయారీ కేంద్రం యజమాని వేల్పూరి సత్తిబాబు చెబుతున్నారు. అప్పటి వరకు బయట కూర్చున్న మృతుడు సత్తిబాబుతో తాను మాట్లాడి వెళ్లిన కొన్ని నిమిషాలకే ఈ ప్రమాదం జరిగినట్లుగా సత్తిబాబు తెలిపారు. ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

బంగారు ఆభరణాల చోరీ

ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆటోలో ఓ మహిళను ఏమార్చి 70 గ్రాముల బంగారు ఆభరణాలను తస్కరించిన మహిళలను టూ టౌన్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. యర్నగూడెంకు చెందిన నాగమాధవి ఈ నెల 6న ఊరు వెళ్లేందుకు తన భర్త, పిల్లలతో కలిసి ఆటో ఎక్కి రాజమహేంద్రవరం వస్తోంది. కాపవరం వద్దకు వచ్చేసరికి ఇద్దరు మహిళలు అదే ఆటోలో రాజమహేంద్రవరం వెళ్లాలని చెప్పి ఆటో ఎక్కారు. నాగమాధవి పక్కన కూర్చొని ఉన్న ఇద్దరు మహిళలు సీటు సరిపోవట్లేదని ఆమెను పక్కకు తోసి కూర్చున్నారు. ఆమె దృష్టి మరల్చి ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో బంగారు వస్తువులతో ఉన్న ప్లాస్టిక్ బాక్స్‌ని దొంగిలించారు. ఆ ఇద్దరు మహిళలు రాజమహేంద్రవరం కోటిపల్లి బస్ స్టాండ్ వద్ద దిగిపోయారు. నాగమాధవి రైల్వే స్టేషన్ వద్ద దిగి తన హ్యాండ్ బ్యాగ్‌ని చూసుకునేసరికి జిప్ ఓపెన్ చేసి, అందులో ఉన్న బంగారు ఆభరణాలతో ఉన్న ప్లాస్టిక్ బాక్స్ కనబడలేదు. దీంతో ఆమె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ పి.శివగణేష్ దర్యాప్తు వేగవంతం చేశారు. గోకవరం డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆవుల భూలక్ష్మి, నాగెల్లి దుర్గను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 50 గ్రాముల 2 బంగారు నెక్లెస్‌లు, 11 గ్రాముల 2 జతల దుద్దులు, 9 గ్రాముల 2 బంగారు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఏఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుల్స్ ఎస్‌కే రబ్బానీ, యూ.నాగబాబు, సులోచనలను పోలీసు అధికారులు అభినందించారు.

బాణసంచా కేంద్రాలపై దాడులు



దాడుల్లో స్వాధీనం చేసుకున్న బాణసంచాతో పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అక్రమ బాణసంచా నిల్వలు, తయారీ కేంద్రాలపై జిల్లా పోలీసులు గురువారం మెరుపు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ డి.నరసింహకిశోర్ తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాణసంచా తయారీ కేంద్రాలు, స్టోరేజ్ గోడౌన్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బొమ్మూరు, రాజానగరం, బిక్కవోలు, కడియం, చాగల్లు, సమిశ్రగూడెం, సీతానగరం, గోకవరం, నల్లజర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో బాణసంచా తయారీ కేంద్రాలు, గోడౌన్‌లపై కేసులు నమోదు చేశారు. బాణసంచా లైసెన్సు కల్గిన వారు మాత్రమే ప్రభుత్వ నియమ నిబంధలనకు లోబడి బాణసంచా తయారీ లేదా విక్రయాలు చేయాలని ఎస్పీ డి.నరసింహాకిశోర్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి ఎవరైనా జన సంచార స్థలాల్లోను, అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన, విక్రయాలు జరిపిన అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు ఈ తనిఖీలు కొనసాగించాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా రహస్యంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్నట్లు, నిల్వ ఉంచినట్లు తెలిస్తే డయల్ 112 కాల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన జిల్లా బాలబాలికల జట్టు

11, 12 తేదీల్లో బాపట్లలో జాతీయ స్థాయి పోటీలు

దేవరపల్లి: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు తూర్పు గోదావరి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక గురువారం దేవరపల్లి మండలం రామన్నపాలెం జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఎంపిక పోటీల్లో సుమారు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో బాల బాలికల జట్ల ఎంపిక జరిగింది. ఈ జట్లు ఈ నెల 11,12 తేదీల్లో బాపట్లలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్టు ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ తెలిపారు. బాలుర జట్టుకు జి. కోట సతీష్(దొమ్మేరు), ఎం.ఆంథోని(రామన్నపాలెం), వై. పాల్(దొమ్మేరు), బి, చరణ్(దొమ్మేరు), ఎ. వివేక్(దేవరపల్లి), బి. రాధాకృష్ణ (రామన్నపాలెం) ఎంపికయ్యారు. బాలికల జట్టులో దుర్గా మాధవశ్రీ (చిన్నాయగూడెం), ఎం. మహాలక్ష్మి (రామన్నపాలెం), ఎం.లాస్య(రామన్నపాలెం), ఎస్‌కే మనిషాబేగం(రామన్నపాలెం), ఎం.జేసీశ్రీ(రామన్నపాలెం), డి. సౌజన్య(చిన్నాయగూడెం), కె. సౌజన్య(చిన్నాయగూడెం), కె. సుభాషిణి (రామన్నపాలెం) ఎంపికైనట్టు రవీంద్రనాథ్ తెలిపారు. పోటీలను పీడీలు ఎల్. గణపతి, టి.సరస్వతి, సీహెచ్ సతీష్, పి.సాయి పర్యవేక్షించారు.

చెరువు నీటిలో విష అవశేషాలు



పెద్దేవంలో పర్యటిస్తున్న పశు సంవర్ధక శాఖ డీడీ తదితరులతో మాట్లాడుతున్న ఉప సర్పంచ్

తాళ్లపూడి: పెద్దేవం చెరువు నీటిలో విష అవశేషాలు ఉన్నట్టు గుర్తించామని, రైతులు తమ పశువులకు ఇన్సూరెన్స్ చేసుకుంటే నష్టాన్ని నివారించవచ్చునని పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పెద్దేవం గ్రామంలో కొద్దిరోజులుగా అనారోగ్యంతో మృత్యువాత పడుతున్న గేదెల జబ్బును గుర్తించేందుకు వీలుగా ఆయన ఆధ్వర్యంలో బృందం పర్యటించి గేదెల పేడ, మూత్రం పరీక్షలు చేయించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా 50 మందికి పైగా రైతుల హాజరై తమ గేదెల పేడ పరీక్షలు చేయగా 90 శాతం గేదెలలో జలగ వ్యాధి ఉన్నట్లు గుర్తించినట్లు పశు సంవర్ధక శాఖ డీడీ పేర్కొన్నారు. డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యంగా గేదెలకు ప్రభుత్వ ఇన్సూరెన్స్ పథకం అమలులో లేనందున ప్రైవేట్ కంపెనీ ఇన్సూరెన్స్ అయినా సరే తీసుకుంటే నష్ట నివారణకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులను రైతులకు పరిచయం చేశారు. మృత్యువాత పడ్డ ఒక గేదెకు పోస్ట్‌మార్టం నిర్వహించి, జరిపిన పరీక్షల్లో రెండు వైరస్‌లు గుర్తించినట్లు, చెరువు నీటిలో పేరాకాట్ పోయిజనింగ్ అవశేషాలు ఉన్నట్లు తేలిందని, అవి ప్రమాదకరమని, గేదెలలో వ్యాధి నిరోధక శక్తి నశించి, మిగతా వైరల్ రోగాల పెరుగుదలకు అవకాశం ఇస్తోందని అన్నారు.

నష్ట పరిహారం ఇవ్వాల్సిందే

గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు పేరాకాట్ పాయిజన్ పొలాల్లో వాడతారని దీనివల్ల గేదెలకు రోగాలు వచ్చాయనటం ఆశ్చర్యంగా ఉందని, గేదెలకు వచ్చిన రోగాన్ని నిర్ధారణ చేసి సరైన మందు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెరువులో నీరు తాగని గేదెలకు కూడా వ్యాధి వచ్చిందని దానికి సమాధానం చెప్పాలని అన్నారు. పశుసంవర్ధక శాఖ డాక్టర్లు చేస్తున్న వైద్యం తమ గ్రామంలో రైతులకు సంతృప్తిగా లేదని తెలిపారు. దీనిని రాజకీయం చేయకుండా గేదెలు నష్టపోయినవారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ఎ.వెంకటరెడ్డి, కాకినాడ ల్యాబ్‌కు చెందిన డాక్టర్ సందీప్, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, తాళ్లపూడి మండల పశువైద్యాధికారులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

పొగాకు నాట్లు ప్రారంభం

- 80 వేల ఎకరాల్లో పంట సాగు
- 14,754 మంది రైతులు
- 12,723 బ్యారన్లు
- ఆసక్తి చూపుతున్న కౌలురైతులు
- లాభసాటిగా పొగాకు సాగు
- గణనీయంగా పెరగనున్న సాగు విస్తీర్ణం



దేవరపల్లి మండలం సంగాయగూడెంలో పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు



నాటడానికి మడుల్లో సిద్ధంగా ఉన్న పొగాకు నారు



రూ.10.50 లక్షలు పలుకుతున్న బ్యారన్

దేవరపల్లి: మన జిల్లాతో పాటు ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా పండిస్తున్న వర్జీనియా పొగాకు సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. 2025-26 పంట కాలానికి రైతులు పొగాకు నాట్లు ప్రారంభించారు. వారం రోజులుగా నాట్లు వేస్తున్నారు. మెట్ట ప్రాంతంలోని ఎర్రమట్టి ఇసుక నేలలు, నల్లరేగడి భూముల్లో పొగాకు సాగు జరుగుతుంది. ఉత్తర తేలిక నేలల్లో(ఎన్ఎల్ఎస్) పండిస్తున్న పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు, ఏలూరు జిల్లాల్లో ఎన్ఎల్ఎస్ పొగాకు సాగు జరుగుతుంది. ఈ పొగాకుకు ఎగుమతి ఆర్డర్లు ఉండడంతో మంచి ధర పలుకుతుంది. రెండేళ్లుగా పొగాకు పంట రైతులకు కాసులు కురిపిస్తోంది. ఎక్కువ పెట్టుబడితో కూడిన పంట ఎన్ఎల్ఎస్ సాగు. ఎకరాకు దాదాపు రూ.3 లక్షలు పెట్టుబడి అవుతుంది. నవంబర్ నెలాఖరుకు పొగాకు నాట్లు పూర్తికానున్నాయి. ఈ నెల 15 తర్వాత నాట్లు ముమ్మరంగా జరుగుతాయని బోర్డు అధికారులు చెబుతున్నారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతాన్ని అప్పర్ ఎన్ఎల్ఎస్, లోయర్ ఎన్ఎల్ఎస్ ప్రాంతాలుగా పిలుస్తారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం వేలం కేంద్రాల పరిధిలోని ప్రాంతాలను అప్పర్ ఎన్ఎల్ఎస్, గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల పరిధిలోని ప్రాంతాలను లోయర్ ఎన్ఎల్ఎస్ ప్రాంతంగా పిలుస్తారు. ఏటా అప్పర్ ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో ముందస్తు సాగు ప్రారంభిస్తారు. అక్టోబర్ మొదటి వారంలో అక్కడ నాట్లు వేయగా, 20 రోజుల తేడాలో లోయర్ ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో సాగు ప్రారంభిస్తారు. ప్రస్తుతం అప్పర్ ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో ముమ్మరంగా నాట్లు జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు.

పెరిగిన సాగు

రెండు జిల్లాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో రైతులు పొగాకు పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది బోర్డు లెక్కల ప్రకారం 29,480 హెక్టార్లలో పంట సాగు చేశారు. బోర్డు అనుమతి లేకుండా మరొక నాలుగు వేల హెక్టార్లలో సాగు చేసినట్టు సమాచారం. రాజమహేంద్రవరం రీజనల్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1,2 వేలం కేంద్రాల పరిధిలో 14,754 మంది రైతులు 12,723 బ్యారన్లు కలిగి ఉన్నారు.

అధిక దిగుబడుల వంగడాల సాగు

అధిక దిగుబడులు వస్తున్న వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. సీటీఆర్ఐ, ఐటీసీ సంస్థల నుంచి వంగడాలను రైతులు కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. ఎల్‌వీ-7, 1353 వంగడాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ వంగడాలు ఎకరాకు 10 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడినిస్తున్నాయి. కిలో విత్తనం రూ.25 వేలకు కొనుగోలు చేస్తున్నారు.

అంతరించిపోతున్న జీడిమామిడి పంట

జీడిమామిడి పంట మెట్ట ప్రాంతంలో అంతరించిపోతోంది. మార్కెట్లో పొగాకు ధర లాభసాటిగా ఉండడం, కౌలు ఎక్కువగా రావడంతో రైతులు జీడిమామిడి తోటలను తొలగించి పొగాకు సాగు చేస్తున్నారు. జీడిమామిడి పంట దిగుబడి తగ్గడంతో పాటు ధర లేకపోవడంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు.

కౌలు రైతుల మధ్య పోటీ

రెండేళ్లుగా పొగాకు సాగు లాభసాటిగా ఉంది. కిలో రూ.430 ధర పలకడంతో కౌలుదారులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. కౌలుదారుల మధ్య పోటీ ఏర్పడంతో భూమి కౌలు ఎకరం రూ.80 వేల నుంచి రూ.1 లక్ష పలుకుతోంది. ప్రాంతాన్ని బట్టి కౌలు పలుకుతుంది. బ్యారన్ లీజు రూ.2లక్షల నుంచి రూ.2.50 లక్షలు పలుకుతుంది. బ్యారన్ లైసెన్స్ ఖరీదు రూ.10.50 లక్షలు పలుకుతుంది. మూడేళ్ల క్రితం బ్యారన్ ఖరీదు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలు ఉండగా, గత ఏడాది రూ.8 లక్షలు పలికింది. ప్రస్తుతం రూ.10.50 లక్షలు పలుకుతుండడంతో ఎక్కువ బ్యారన్లు ఉన్న రైతులు కొన్ని బ్యారన్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

పరిమితికి మించి పంట వేయవద్దు



పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితికి లోబడి పంట వేయాలి. బ్యారన్‌కు 1.6 హెక్టార్ల విస్తీర్ణంలో పంట వేసి 35 క్వింటాళ్లు ఉత్పత్తి చేయాలి. అధిక విస్తీర్ణంలో పంట సాగు అనర్థదాయకమే. అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలి. వరి పంట వేసిన బాడవ భూములు, పల్లపు ప్రాంత భూముల్లో సాగు చేయవద్దు. నారుమడిలో మేలైన నారును ఎంచుకుని నాట్లు వేసుకోవాలి. రిజిస్ట్రేషన్ గల నర్సరీల నుంచి నారు కొనుగోలు చేయాలి. అప్పర్ ఎన్ఎల్ఎస్‌లో నాట్లు జరుగుతున్నాయి. దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలో రెండు రోజులుగా నాట్లు వేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు ట్రే నారు నాట్లు వేస్తున్నారు.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు, రాజమహేంద్రవరం